ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించుకుందాం

టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర - మధురవాడ: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జీవీఎంసీ 7వ వార్డు ఫరిది కార్‌షెడ్ జంక్షన్ దరి ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పాలనను దృష్టిలో ఉంచుకుని వైసీపీ అభ్యర్థులను గెలిపించి ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని త్రిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్, పార్లమెంటు సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా వేపాడ చిరంజీవి గెలుపు ఖాయం

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ బలపర్చిన అభ్యర్థి వేపాడ చిరంజీవి భారీ మెజార్టీతో గెలుస్తారని మాజీ మంత్రి బండారు సత్యన్నారాయణ మూర్తి ధీమా వ్యక్తం చేశారు. పెందుర్తి నియోజకవర్గ టి.డి.పి.కేడర్‌కు అభ్యర్థి చిరంజీవి పరిచయ కార్యక్రమం సుజాతనగర్ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలుగా వైసీపీ అరాచక పాలన చూసిన ప్రజలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సేనాపతి వసంత శంకర్రావు, రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు, పెందుర్తి మండల పార్టీ అధ్యక్షుడు కరక దేముడు పాల్గొన్నారు.

వైసీపీ విద్యార్థి వింగ్ జిల్లా అధ్యక్షుడుగా హరి

విశాలాంధ్ర - నక్కపల్లి: వైసీపీ విద్యార్థి వింగ్ జిల్లా అధ్యక్షుడిగా ఉపమాకకు చెందిన కొప్పిశెట్టి హరిబాబు (అప్పారావు) నియామకం అయ్యారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూప రేఖలు మారిపోయాయని, విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. ఈ అవకాశం కల్పించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మంత్రి గుడివాడ అమర్నాథ్, టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపి సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, రాష్ట్ర కాపు కార్పోరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్, డీజిల్ పక్కదారి పట్టిస్తే చర్యలు

విశాలాంధ్ర - హుకుంపేట: ప్రభుత్వం గిరిజన సహకార సంస్థ ద్వారా ఏర్పాటు చెసిన బంక్ నుండి పెట్రోల్, డిజిల్ పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పదని విశాఖ ఉమ్మడి జిల్లా సేల్స్ ఆఫీసర్ యాస్ మిశ్రా దేశించారు. గురువారం మండల కేంద్రంలో గల పెట్రోల్ బంక్ తనిఖీ నిర్వహించి పెట్రోల్, డీజిల్ నాణ్యత పరిశీలించారు. ప్రతి రోజు అమ్మకం చేసే రికార్డులు, స్టాక్ రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. హెయిర్ మిషన్ ఏర్పాటు చేయకపోవడంతో కొంత అసంతృప్తి పద్దారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద పెట్రోల్, డీజిల్ అమ్మకాలు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఆర్ఐ రంగరావు, వీఆర్వో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్‌ను గెలిపించండి

విశాలాంధ్ర - గాజువాక సిటీ: గాజువాక శ్రామిక నగర్ కుంచమాంబ కాలనీలో బిజెపి ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ కర్ణంరెడ్డి నరసింగరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. బీజేపీ విశాఖపట్నం జిల్లా ఇంచార్జ్ కోడూరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గాజువాక నియోజవర్గంలో గల 15 ఎమ్మెల్సీ పోలింగ్ బూత్‌లలో గల 24 వేల ఓటర్లను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి పివిఎన్ మాధవ్‌కి ఓటు వేయాలని కోరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేనంకొండ కృష్ణంరాజు, సిరసపల్లి నూకరాజు, మండల అధ్యక్షులు గూటూరు శంకరరావు, సోమశేఖర్, తాతారావు, పావని, రోహిణి, వజ్రి లలిత, జిలకర్ర భువనేశ్వరి, అప్పలరాజు, ముసలయ్య, రంజిత్, రాజశేఖర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశాకు తెలంగాణ బస్ సర్వీసులు

విశాలాంధ్ర - చింతూరు: ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న మార్గాల్లో 10 బస్సులను తిప్పేందుకు ఒడిశా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థతో తెలంగాణ ఆర్టీసీ ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్ బస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో సంస్థ ఎండీ వీసీ సజ్జనార్, ఓఎస్ ఆర్టీసీ ఓఎస్‌డీ దినేష్ కుమార్ పట్నాయక్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం తెలంగాణ ఆర్టీసీ 10 బస్సులను ఒడిశాకు ఓఎస్‌ఆర్టీసీ 13 బస్సు సర్వీసులను తెలంగాణకు నడపుతాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సర్వీసుల్లో హైదరాబాద్ నుంచి జైపూర్, ఖమ్మం-రాయఘఢ, భవానిపట్నం నుంచి భద్రాచలం మీదుగా విజయవాడ భద్రాచలం-జైపూర్, నవరంగ్ పూర్ -హైదరాబాద్,రాయఘఢ-కరీంనగర్ మధ్య బస్సులు నడపనున్నాయి.

75వ వార్డులో కింజరాపు ఎర్రన్నాయుడుకు ఘన నివాళులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: స్థానిక 75వ వార్డులో మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి వేడుకలు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డిలు ఎర్రన్నాయుడుకు ఘన నివాళులర్పించారు. ఎర్రన్నాయుడు పార్టీకి, కేంద్ర మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలు మరువరానివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నమ్మి అప్పారావు, దోమ్మేటి పెరుమాళ్ నామాల పెంటయ్య, శ్రిమూసిరీ శ్రీనివాసరావు, మోళ్ళి రమణ, ఉరుకుటి వెంకటరావు, అండిబోయిన రాము నాయుడు, బస అప్పల రెడ్డి,,కాకినాడ అప్పల రాజు, మొళ్లి అప్పారావు, దోమ్మేటి సోము నాయుడు, ముద్దుర్తి మణికంత, రమణ, రాజు, రెడ్డి పైడి రెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆటో డ్రైవర్లు ప్యాసింజర్లను తీసుకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకుని నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం అన్నారు. ఆనందపురం మహాత్మా గాంధీ పూలు మార్కెట్ దగ్గర ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. డ్రైవర్ పక్కన ముందు సీట్లో ప్యాసింజర్లను కూర్చో బెట్టరాదని, అలా కూర్చోబెట్టి వాహనం నడిపితే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 25 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రజా మద్దతుతోనే అభివృద్ధి పనులు సాధ్యం

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి పనులు ప్రజా మద్దతుతోనే సాధ్యపడుతుందని మండల వైసీపీ సీనియర్ నాయకులు బి.సింహాచలం చెప్పారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సాగర, గసభ, సొవ్వ మూడు పంచాయతీలకు సంబంధించి గిరిజనులకు రహదారి సౌకర్య కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం తారు రోడ్డు మంజూరు చేసిందన్నారు. అయితే రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు చేపట్టే రోడ్ రోలర్, బండి టైర్ల గాలి తీయడం, సిమెంట్ బస్తాలను దొంగలించడం వంటి పరిస్థితుల వల్ల రోడ్డు నిర్మాణ పనులు జాప్యం జరుగుతున్నట్లు కాంట్రాక్టర్లు తమ దృష్టిలో పెట్టారని ఆయన చెప్పారు. రహదారి నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నర్సింగరావు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగులు, తోటల పెంపకంపై శిక్షణ

విశాలాంధ్ర - కె.కోటపాడు: చిన్న తరహా పుట్టగొడుగులు, గార్డెనింగ్ తోటల పెంపకంపై భారతీయ వ్యవసాయ నైపుణ్య మండలి, బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఉద్యానవన శాఖ అధికారిణి కిరణ్మయి తెలిపారు. పాల పుట్టగొడుగులు, ముత్యపు చిప్ప పుట్టగొడుగులు, గార్డెనింగ్‌లో యాజమాన్య పద్ధతులు మామిడి జీడి జామ మొదలగు తోటల పెంపకంపై 27 రోజులు పాటు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్ అందిస్తారని అన్నారు. ఈనెల 27 నుండి మార్చి 25వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని, ఉచిత వసతి భోజన సదుపాయం కల్పిస్తారని అన్నారు. వివరాలకు 7382700894ను సంప్రదించాలని కోరారు.

సమీద ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - అనంతగిరి: సమీద ప్రోగ్రాం డైరెక్టర్ డి.వీరభద్రరావు ఆదేశాల మేరకు అనంతగిరి మండలంలో బైబిల్ టబార్నికల్ చర్చి అమెరికా వారి సహకారంతో లక్ష్మీపురం, మర్దగూడ, కమలాపురం, కప్పటివలస స్కూళ్లలో 150 మంది గిరిజన పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేశారు. సమీద ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.బుద్దురాజు మాట్లాడుతూ వెనుకబడిన పిల్లలందరికీ ఆశకిరణ్ ప్రోగ్రాం ద్వారా పిల్లలకు క్లాసులు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్వైజర్ సింహాద్రి, సమీద సిబ్బంది అప్పలరాజు, కృష్ణ, దేవుడమ్మ, కాసులమ్మ, ఆశకిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక మెయిన్ రోడ్డులో గల శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శ్రీ కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహి ంచారు. ఆలయ కమిటీ చైర్మన్ సూరిశెట్టి రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణ మహోత్సవంలో దంపతులు పూజలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ శర్మ పూజలు, అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా నాగూర్ బాబు

విశాలాంధ్ర - చింతపల్లి : అల్లూరి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షునిగా చింతపల్లి గ్రామానికి చెందిన షేక్ నాగూర్ బాబు నియమితులయ్యారు. వైసీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. పాడేరు నియోజకవర్గంలో చింతపల్లికి చెందిన నాగూర్ బాబును గుర్తించి ఈ పదవిని కేటాయించడం సంతోషకరంగా ఉందని చింతపల్లి మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వలి, చింతపల్లి ముస్లిం కమిటీ సభ్యులు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి నాగూర్ బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇల్లు కట్టుకునేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట రూరల్: తాను ఇల్లు కట్టుకునేందుకు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని మండలంలోని గోపాలపట్నం గ్రామానికి చెందిన బీరా రాణి, వరప్రసాద్ దంపతులు కోరుతున్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం కేటాయించినట్లు తెలిపారు. జగనన్న కాలనీలో ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దగ్గర నుండి మార్చాలని విద్యుత్ అధికారులను కోరుతూ వచ్చానని తెలిపారు. చలానా కట్టి దరఖాస్తు చేసుకొని 3నెలలు దాటినా నేటికి విద్యుత్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు చర్యలు తీసుకోవాలని బీరా రాణి, వరప్రసాద్ కోరారు.

ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమా..!

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణ కాలుష్యం అవుతోందని ప్లాస్టిక్‌ని పూర్తిస్థాయిలో నిషేధించింది. భక్తులెవరూ ప్లాస్టిక్ కవర్లలో వస్తువులు కొండపైకి తీసుకురాకూడదని విజ్ఞప్తి చేసింది. 2020 జనవరిలోనే ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, కవర్లను దేవస్థానం నిషేధించినా అది ఒక్కసారిగా అమల్లోకి రాలేదు. క్రమక్రమంగా వీటికి భక్తులు అలవాటు పడ్డారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో బయోడీగ్రేడబుల్ కవర్లు, స్వామి వారి ప్రసాదాలకు క్లాత్ కవర్లను తీసుకువచ్చింది. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి శ్రీకారం చుట్టిందని ఈఓ త్రినాధరావు పేర్కొన్నారు. అయితే భక్తుల వాదన మరోలా ఉంది. ఇప్పుడు ప్లాస్టిక్ పూర్తి స్థాయిలో బ్యాన్ అంటే ముడిసరుకులపై ప్లాస్టిక్ తొలగించాలంటే సాధ్యం కాదు. ఇక్కడ పంచలు ఎక్కువగా వాడతారు. వాటిపై కవర్ తీసేస్తే మాసిపోతాయి. ఎవరూ కొనరు వాటికి అట్టప్యాకింగ్ అంటే మళ్లీ ధర పెరిగిపోతుంది. మట్టి గాజులు అయితే పేపర్లో చుట్టి ఇస్తాము. పాలిష్ వేసిన వాటికి కవర్ లేకపోతే వాటి పాలిష్ పోతుంది. బొమ్మలు లాంటివి కొన్నవారు ఇంటికి తీసుకు వెళతారు తప్ప ఇక్కడ వాడరు. ఎక్కడో చైనాలో తయారయ్యే వస్తువు కవర్ లేకుండా ఎలా వస్తుంది. అలాంటి వాటిని రీప్యాకింగ్ చేయాలంటే మాకు సాధ్యం కాదు. షాంపూలు, నూనెలు, కర్పూరం, కలకండ లాంటివి కవర్ లేకుండా ఎలా వస్తాయి. ఇలాంటి వాటన్నిటికీ వేరే ప్యాకింగ్ అంటే తయారీదారుల దగ్గర నుంచే రావాలి. అది సాధ్యమా...? ప్లాస్టిక్‌పై పూర్తిస్థాయి బ్యాన్ పెట్టడంవల్ల కొనే భక్తులపై కూడా భారం పడుతుంది. దీనిపై దేవస్థానం పునరాలోచించుకోవాలని కోరతామని భక్తులు అంటున్నారు.

ఔషధ రంగంలో భారత్ అద్వితీయ ప్రగతి

అమెరికా ఎఫ్‌డిఏ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసా

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఔషధ రంగంలో భారత్ అద్వితీయమైన ప్రగతి సాధిస్తోందని అమెరికాలోని ఎఫ్‌డిఏ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసా అన్నారు. గురువారం ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏయూ-యుఎస్ ఎఫ్‌డిఏ సంయుక్తంగా నిర్వహించిన 'కరెంట్ గుడ్ మానుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్' రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాణ్యమైన ఔషధాల తయారీకి నిరంతరం కృషి జరగాలన్నారు. మరింత మెరుగైన, నాణ్యమైన తయారీ విధానాలను అనుసరించడం ఎంతో అవసరమన్నారు. చట్టాలను అవసరమైన మార్పులుచేసుకుని అమలు చేయడం జరుగుతోందన్నారు. ఎఫ్‌డిఏ నియమావళిని ఖచ్చితంగా ఔషధ తయారీ పరిశ్రమలు అనుసరించాల్సిందేనని స్పష్టంచేసారు. ఇంటర్నేషనల్ రిలేషన్స్ స్పెషలిస్ట్(డ్రగ్స్) యుఎస్ ఎఫ్‌డిఏ ఇండియా గ్రెగరీ స్మిత్ మాట్లాడుతూ ప్రజారోగ్యమే ఎఫ్‌డిఏ పరమావధిగా నిలుస్తుందన్నారు. అత్యుత్తమ ప్రమాణాలతో ఔషధాలు, ఆహార ఉత్పత్తుల తయారీకి అనవరమైన మార్గదర్శకం, పర్యవేక్షణ, టెస్టింగ్, రెగ్యులేటరీ తదితర సేవలు అందిస్తామన్నారు. అమెరికా దిగుమతి చేసుకునే రొయ్యిల్లో 40 శాతం రొయ్యిలు భారత్ నుంచి వస్తున్నాయన్నారు. 2021 నాటికి భారత్‌లో 331 సంస్థలు ఎఫ్‌డిఐ గుర్తింపు కలిగి ఔషధాల తయారీ జరుగుతోందన్నారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఏయూలో ప్రత్యేకంగా ఔషధ సంబంధ అంశాలపై స్టార్టప్ సెంటర్‌ను నెలకొల్పడం జరుగుతోందన్నారు. అదే విధంగా డిఎఫ్‌ఆర్ఎల్, ఏపి ఫుడ్ సొసైటీ సహకారంతో ఫుడ్ టెస్టింగ్ లాబరేటరీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూక్ హిగ్గిన్స్, సీనియర్ ఫార్మసూటికల్ ఎసెసర్ అదితి ఠాకూర్,కంజ్యూమర్ సేఫ్టీ ఆఫీసర్ సలీమ్ అక్తర్, ఓఆర్‌ఏ నేషనల్ ఎక్స్‌పర్ట్ జోన్ మెలెంజ్ ,అమెరికాకు చెందిన వయాట్రిస్ గ్లోబల్ క్వాలిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవ పురాణం, ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, అంతర్జాతీయవ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావు తదితరులు ప్రసంగించారు.

రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి

వాహనదారులకు, పాదచారులకు ఇక్కట్లు

విశాలాంధ్ర-యలమంచిలి: పట్టణం వేగంగా విస్తరిస్తున్న తరుణంలో పలు చోట్ల అటు సాధారణ భవనాలు, ఇటు బహుళ అంతస్థుల భవనాల నిర్మాణం కూడా శర వేగంగా సాగుతుందని చెప్పుకోవచ్చు. కోర్టు పేటలో నిత్యం వస్తు రవాణాకు సంభందించిన వాహనాలు, అక్కడే ప్రైవేటు పాఠశాల కూడా ఉండటంతో పాఠశాలకు విద్యార్థులను తీసుకు వచ్చే వాహనాలు నిత్యం అధిక సంఖ్యలో ప్రయాణిస్తూనే ఉంటాయి. అదే దారిలో రోడ్డు ప్రక్కనే గత కొన్ని నెలల నుంచి బహుళ అంతస్థుల భవనం కూడా నిర్మాణంలో ఉంది. దీనికి సంబంధించిన నిర్మాణ సామగ్రిలలో ముఖ్యంగా ఇసుకను అన్ లోడింగ్ చేసే సమయంలో ద్విచక్ర వాహనదారులు, పాదచారులతో పాటుగా పలువురు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులెవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని గ్రామం నుండి బహిష్కరించాలి

విశాలాంధ్ర - పద్మనాభం: బందేపురం గ్రామపంచాయతీలో భూ ఆక్రమణలకు పాల్పడుతున్న కుటుంబాలను గ్రామం నుండి బహిష్కరించాలని గురువారం తహశీల్దార్‌కు సుమారు 300 మంది ఫిర్యాదు చేశారు. బందేపురం గ్రామానికి చెందిన దేండేటి అప్పన్న, దెండేటి చిన్నప్పన్న, దెండేటి రాజు, దెండేటి పైడిరాజు, దేండేటి అప్పన్నలు వారి కుటుంబ సభ్యులు గ్రామంలో ఉన్న ప్రదేశాలను ఆక్రమించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. గతంలో ఇదే గ్రామానికి చెందిన సాగి బుల్లి నాన్నకు ఉన్న ఒక ఎకరం జెరాక్స్ మెట్టు భూమిని ఆక్రమించగా అప్పటి సీఐ దీనిని పరిశీలించి న్యాయం చేశారన్నారు. మరల రెల్లిపేట వద్ద ఉన్న గొడౌన్ కట్టవలసిన భూమిని ఆక్రమించి చర్చి కట్టడానికి ప్రయత్నించారని, కమ్యూనిటీ భవనాన్ని ఆక్రమణలో భాగంగా కూల గొట్టారని, పద్మనాభం గ్రామంలో ఉన్న సర్వేనెంబర్ 1లో సుమారు 28 సెంట్లు భూమి ఆక్రమించారని అన్నారు. బాంధవ పురం న్యూ ఎస్సీ కాలనీలో సుమారు 25 సెంట్లు భూమిని ఆక్రమించారని, 2023 ఫిబ్రవరి నెలలో సాగి కృష్ణ మూర్తి, రాజు సత్యనారాయణ, రాజు సాయి, నారాయణ మూర్తి రాజుకి ఉన్న జిరాయితి భూమిని కూడా ఆక్రమించారన్నారు. అన్యాయంగా సాగి అప్పలరాజును వీరి కుటుంబ సభ్యులైన దేండేటి మంగమ్మ, దిండేటి బ తమ్మ, దిండేటి శ్యామ్ కుమార్, దేండేటి ప్రేమ్ కుమార్‌లు దౌర్జన్యం చేసి తప్పుడు కేసులు పెట్టారని ఆ సమయంలో లేని సాయి కృష్ణ మూర్తి రాజుపై కూడా తప్పుడు కేసులు పెట్టారని తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో శాంతిభద్రతల నెలకొల్పేటట్లు చేయాలని వినతిలో కోరారు.

పార్లమెంటు రత్నకు విజయసాయి ఎంపిక పట్ల హర్షం

విశాలాంధ్ర - కొయ్యూరు: రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డిని పార్లమెంట్ రత్న అవార్డుకు ఎంపిక చేయడం పట్ల అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఆమె భర్త శివప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. సన్ సద్ రత్న అవార్డుకు ఎంపికైన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని అరకు ఎంపీ మాధవి శివప్రసాద్ దంపతులు ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జిసిసి చైర్పర్సన్ శోభా స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వైసిపి యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి శెట్టి వినయ్, అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ బాబు తదితరులతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి అభినందించారు.

బాలికపై అత్యాచారయత్నం

విశాలాంధ్ర - భీమిలి: మండలంలోని అప్పికొండ వీధి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఐదేళ్ల బాలికపై బుధవారం అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. మండలంలో సంచలనం రేకెత్తించిన సంఘటన వివరాలు... భీమునిపట్నం అప్పికొండ వీధికి చెందిన 50 సంవత్సరాలు వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన బాలిక తల్లిదండ్రులు వెంటనే అడ్డుకున్నారు. ఆ వ్యక్తిపై భీమునిపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. ఆపై దిశ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. దిశ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

55 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న 55 కేజీలు గంజాయిని, నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మండలం ఉవ్వాసింగి పంచాయతీ కేంద్రం నుంచి మైదాన ప్రాంతానికి కారులో అక్రమంగా తరలిస్తుండగా తనిఖీ చేసి 55 కేజీల గంజాయిని, కారును, స్కూటీని స్వాధీనం చేసుకున్నామన్నారు. విశాఖకు చెందిన షేక్ మస్తాన్ వాలి, శంకర్రావు, అలాగే చింతపల్లి మండలం లోతుగడ్డ గ్రామానికి చెందిన సురేష్ గోవింద రాజును అదుపులోకి తీసుకున్నా మన్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీ అయ్యారని తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

విశాలాంధ్ర - మల్కాపురం: అజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హిందూస్తాన్ షిప్ యార్డ్ కాలనీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సముదాయంలో గురువారం యోగ కార్యక్రమం జరిగింది. యోగ వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో షిప్ యార్డ్ అధికారులు, యూనియన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన పశువుల పాకలు

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని గజపతి నగరంలో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదంలో చదరం వరలక్ష్మి, రామకోటిలకు చెందిన పశువుల పాకలు పూర్తిగా కాలిపోయినట్లు చోడవరం అగ్నిమాపక కేంద్రం అధికారి బి.వి.రామస్వామి తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడు ఎరువుల బస్తాలు, వాటర్ పంప్ హెజ్ పైపులు రెండు కాలిపోగా, ఈ పాకలో వుండే ఆవు, పెయ్యి స్వల్ప గాయాలతో బయటపడ్డాయి అని తెలియజేశారు. సుమారు రెండు లక్షల రూపాయలు వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేశామన్నారు.

కొండగెడ్డ ఆక్రమణపై 32 మందికి నోటీసులు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలం జి.కోడూరు కొండగెడ్డపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలంటూ ఇరిగేషన్ జేఈ రవికుమార్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరు గ్రామానికి ఆనుకొని ఉన్న కొండగెడ్డను ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపై టీడీపీ నాయకుడు జయరాం స్పందనలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గతవారం రోజులుగా సర్వే చేపట్టామన్నారు. 30 మంది ఆక్రమణదారులు ఉన్నట్లు గుర్తించి వారందరికీ నోటీసులు జారీ చేశామన్నారు.

బాధితులకు జనసేన ఆర్థికసాయం

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని ఖండివరం గ్రామా నికి చెందిన కాపారపు శ్రీను అతని భార్య కూతురు ఇటీవల ప్రమాదంలో గాయపడడంతో జనసేన పార్టీ నాయకులు హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ బోయిదాపు కిరణ్ చేతులమీదుగా 23 వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్ర మంలో విజయ్, సంజీవ్, జివి మూర్తి, హరిబాల, శ్రీనాథ్, విజయ్, సంజీవ్, ఈశ్వర్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుదాం

విశాలాంధ్ర - పాడేరు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అల్లూరి సీతారామరాజు జిల్లా శాఖ చైర్మన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో రక్తదానంపై అవగాహన సదస్సు, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ పి.ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు రక్తం దానం చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ గౌరీశంకర్, కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ రసూల్, కాలేజీ అధ్యాపకులు, ఎంసి మెంబర్ సూర్యారావు, మెడికల్ ఆఫీసర్, రాజబాబు, అప్పారావు, సతీష్, వెంకట్, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పవర్ కెనాల్ గండి మరమ్మతులు పూర్తి

విశాలాంధ్ర - సీలేరు: సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి పవర్ కెనాల్ గండి మరమ్మతు పనులు పూర్తయ్యాయని ఏపీ జెన్‌కో సూపరిండెంటెంట్ ఇంజనీర్ కెకెవి. ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2022 డిసెంబరు 14 అర్ధరాత్రి డొంకరాయి పవర్ కెనాల్ గండి ప్రమాదవశాత్తు కొట్టుకుపోయిన విషయం తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలోనే సుమారు నెల రోజులు మరమ్మత్తు పనులు ఏపీ జెన్‌కో ఉన్నతాధికారులు, సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్లు, పర్యవేక్షణలో శరవేగంగా పూర్తి చేసామని పేర్కొన్నారు. పవర్ కెనాల్‌కు ఇటువంటి సమస్యలు ముందు ముందు తలెత్తకుండా నిరంతరం ఇంజనీర్లు పర్యవేక్షణలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

మా గ్రామంలో వైన్‌షాప్ వద్దు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం నగర శివారు ప్రాంతంలో సెంట్రల్ జైల్ సమీపంలో ఉన్న రామకృష్ణాపురం గ్రామంలో వైన్ షాపు ఏర్పాటు చేస్తామని కొంతమంది అధికారులు చెప్పడంతో గ్రామంలో ఒక్కసారిగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. గురువారం దానిని పూర్తిగా వ్యతిరేకించిన గ్రామ కమిటీ, గ్రామ ప్రజలు ఏకమై పూర్తిగా వ్యతిరేకించడంతో గ్రామంలో చివర వేప చెట్టు దగ్గర ఓం శ్రీ సాయి సప్లయర్స్ షాపు వద్ద టెంట్ వేసి నిరసన తెలియజేశారు. బ్రాందీ షాపు పెట్టకుండా వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తామని గ్రామ ప్రెసిడెంట్ వంకర బాబురావు, గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. మా గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలని, స్టాబుల్ పర్మిషన్ ఇవ్వాలని నినాదాలు చేశారు. వైన్ షాప్ వద్దంటూ ప్రజలు ఒక్కసారిగా నిరసన తెలియజేయడంతో అధికారులు షాక్‌తో వెనక్కి తగ్గారు.

శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం, విశాఖపట్నం జిల్లా.

ఆర్.సి.నెం:సి3/4020/2020, తేది.22.02.2023, ఫోన్ నెం: 9885054588, 9160969755

తాత్కాలిక బహిరంగ వేలం ప్రకటన

శ్రీ స్వామి వారి దేవస్థానం నందు తేది.27.02.2023 ఉదయం గం.11.00లకు కొండ దిగువ దేవస్థానం కార్యాలయం నందు అనగా (తేది.01.03.2023 నుండి తేది.31.03.2023 వరకు) ఒక నెల రోజులకు ఈ క్రింది తెలిపిన వివిధ లైసెన్స్ హక్కునకు తాత్కాలిక బహిరంగ వేలం నిర్వహించబడును.

1) కొండ దిగువ భైరవ వాక వద్ద పూజా సామగ్రి విక్రయించుకొనుటకు 2)కొండపైన సన్నిది ఫలాలు 3)కొబ్బరి కాయలు మరియు పూజా సామగ్రి విక్రయించుకొనుటకు 4)తొలిపావంచా వద్ద భక్తులు సమర్పించిన కొబ్బరి ముక్కలను ప్రోగు చేసుకొనుటకు 5)సెల్‌ఫోన్స్ మరియు కెమేరాలను భద్రపరచుకొనుటకు 6)సామాన్లు (క్లోక్ రూమ్) భద్రపరచుకొనుటకు 7)భైరవ స్వామి వారి దేవాలయంనందు ఐస్ క్రీమ్ అమ్ముకొనుటకు 8) గోపాలపట్నం పెట్రోలు బంకు వద్ద బుధవారం సంత మినహా మిగిలిన రోజులలో ఆశీలను వసూలు చేసుకొనుటకు (9)గురువారం సంతయందు ఆశీలను వసూలు చేసుకొనుటకు 10)గోపాలపట్నం పెట్రోల్ బంకు వద్ద బుధవారం సంత యందు ఆశీలను వసూలు చేసుకొనుటకు 11)పైడితల్లమ్మ, బంగారమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద కొబ్బరి ముక్కలు, చీరలు, రవికలు ప్రోగు చేసుకొనుటకు 12)శ్రీ స్వామి వారి కొండ దిగువ మరియు కొండపైన ఐస్‌క్రీమ్ అమ్ముకొనుటకు 13)శ్రీ స్వామి వారి వరాహ పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకొనుటకు 14)శ్రీ స్వామి వారి కొండ దిగువ మరియు కొండపైన స్టోర్స్‌నందు గల ఖాళీ నూనె, నెయ్యి, జీడిపప్పు డబ్బాలు ఉన్నవి ఉన్నట్లుగా తీసుకొని పోవుటకు 15) శ్రీ స్వామి వారి కృష్ణాపురం గోశాల నందు గల తోటల ఫలసాయాన్ని తేది 01.03.2023 నుండి తేది.30.06.2023 వరకు గల కాలపరిమితికి అనుభవించి హక్కునకు 16)శ్రీ స్వామి వారి కొండ దిగువ చిత్రాడి వారి తోటయందు మామిడి ఫలసాయాన్ని 2023 సీజన్‌నకు అనుభవించు హక్కునకు.

సం/- వి.త్రినాధరావు, కార్యనిర్వహణాధికారి

జీవీఎంసీ ధనాన్ని దోచుకుంటున్న షాడో మేయర్

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మేయర్ భర్త గొలగాని శ్రీనివాస్ కాసులకి కక్కుర్తి పడి షాడో మేయర్‌గా వ్యవహరిస్తూ జీవీఎంసీ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పాలక వర్గం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్న నాటి నుండి మేయర్ భర్త గొలగాని శ్రీనివాసరావు షాడో మేయర్‌గా వ్యవహరిస్తున్నారని జనసేన ముందుగానే చెప్పిందన్నారు. జివిఎంసి మేయర్ క్యాంప్ ఆఫీస్ పేరు చెప్పి లక్షల రూపాయాలను దుర్వినియోగం చేస్తున్నారని, మేయర్ క్యాంప్ ఆఫీస్ కి జీవీఎంసీ నుండి 8 మంది, మరో కాంట్రాక్ట్ సంస్థ తరువున 4గురుని నియమించి, సొంత పనులకు వాడుకుంటున్నారని విమర్శించారు. వీరిలోని ఒక్కొక్కరికి రూ.18వేలు జీతానికి రూ.10,200 ఇచ్చి, మిగిలిన సొమ్ములను మేయర్ భర్త కాజేస్తున్నారని ఆరోపించారు. జి-20 సదస్సు కోసం 40 హోర్డింగ్లు నోటిఫికేషన్ లేకుండా పెట్టి సొమ్ములు దండుకుంటున్నారని, ఇందులో జీవీఎంసీ కమిషనర్ హస్తం కూడా ఉందన్నారు. ఇంత జరుగుతుంటే సుబ్బారెడ్డి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు, శ్రీనివాస పట్నాయక్, రూప, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

విశాలాంధ్ర - పెందుర్తి: వినియోగదారులకు సేవలు అందించడంలో విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ వివిదశాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయా శాఖలలో అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి తమదృష్టికి తీసుకు రావాలని వాటి పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే ప్రభుత్వానికి ప్రజలకు అధికారులు సిబ్బంది జవాబుదారీగా వ్యవ హరించాలని కోరారు.అనంతరం ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధి నిర్వాహణలో బాధ్యతా యుతంగా ప్రవర్తించాలి లేకుంటే ప్రజల నుండి తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం పలు వురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ విద్యుత్,రెవెన్యూ శాఖ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ శరగడం జాన్సీ లక్ష్మిరాణి రాము, ఎంపీడీఓ బి.రమేష్ నాయుడు, హెచ్‌డిటి, ఏఓ బాబూరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీలేరు నది తీరాన కస్టడీ సినిమా సందడి

విశాలాంధ్ర - చింతూరు: కనుచూపు మేర పరుచుకున్న పచ్చని అందాలు, చుట్టూ ఎత్తైన కొండలు, కనువిందు చేసే సీలేరు నది అందాలు జలపాతాల సోయగాలు, దారి వెంట పచ్చని అడవుల సుందర దృశ్యాలకు పెట్టింది పేరు మన్యంలోని మోతుగూడెం, పొల్లూరు, ఫోర్బాయి, డొంకరాయి గ్రామాలు. అన్ని రకాల చిత్రీకరణకు అనువుగా ఉన్న షూటింగ్ స్పాట్స్‌కు ఫిదా అయిన చిత్ర నిర్మాతలు ఇప్పటికే అనేక సినిమాలు ఈ ప్రాంతాలలో చిత్రీకరణ చేసారు. ఇందులో భాగంగా చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో సీలేరు నది వద్ద 'కస్టడీ' సినిమాలోని ఒక ఫైట్ సీన్‌ని చిత్రీకరించారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమిళ సినీ దర్శకుడు వెంకట ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. కథానాయకుడు అక్కినేని నాగ చైతన్య, కథానాయిక కృతిశెట్టి, తమిళ సినీ యాక్టర్ శరత్ కుమార్, వెన్నెల కిషోర్ నటిస్తున్నారు.మోతుగూడెంలోని గాయత్రి రిసార్ట్ సమీపంలో సీలేరు నది వద్ద ఈ సన్నివేశం చిత్రీకరిస్తున్నారు. గ్రామంలోని ప్రజలు పెద్దఎత్తున షూటింగ్ జరిగే ప్రదేశానికి తరలి వస్తున్నారు. రేపు డొంకరాయిలో ఒకరోజు చిత్రీకరణ చేస్తామని చిత్రబృందం తెలియజేసారు. మోతుగూడెం పోలీసులు భద్రతా చర్యలు పర్యవేక్షణ చేసారు.

ఓర్వలేక తప్పుడు ప్రచారం

విశాలాంధ్ర -గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గన్నవరం దహన కాండపై పశ్చిమ నియజకవర్గం సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ తన మర్రిపాలెం పార్టీ కార్యాలయంలో విలేకులతో సమావేశమయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాడి శ్రీధర్ రెడ్డి అడ్వైజర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాట్లాడుతూ తప్పుడు వార్తలపై స్పందించి, ప్రభుత్వం చిత్తశుద్ధితో నిజాయితీగా వైద్య పరీక్షలు చేయించగా, కేవలం అవి ఆరోగ్య సమస్యల వలన వచ్చిన వాపు మాత్రమేనని నివేదిక వచ్చిందని, జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు అందుతున్న సంక్షేమ పలాలను చూసి ఓర్వలేక పచ్చ మీడియా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయి. లోకేష్ పాదయాత్ర విఫలమవడం, ప్రజల ఆదరించకపోవడం వలన తెలుగుదేశం పార్టీకి చంద్ర బాబుకి దిక్కు తోచక ఇటువంటి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి చంద్రబాబుకి తగిన గుణ పాఠం చెబుతారాన్నారు. కార్యక్రమంలో పివి సురేష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, బెహరా భాస్కరరావు, జి విఎంసి కోఆప్షన్ మెంబర్, కలిదిండి బద్రీనాథ్, జిల్లా వైయస్సార్ టియుసి ప్రెసిడెంట్, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, శ్రీమతి ముర్రు వాణీ నానాజీ, వార్డు అధ్యక్షులు శ దొడ్డి కిరణ్, చుక్కా ప్రసాద్ రెడ్డి, సోమాదుల సురేష్, ఆదరి శ్రీనివాసరావు, గునిశెట్టి శ్రీనివాసరావు, గొర్లె అప్పలస్వామి నాయుడు, శ్రీమతి మల్ల ధనలత, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్, సీనియర్ నాయకులు దాడి సత్యనారాయణ, ఆళ్ల పైడిరాజు, రెహమాన్ , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - హుకుంపేట: పెళ్లి జరగదని బాధతో మద్యం మత్తులో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్ఐ సతీష్ అందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాంగి ప్రసాద్ (21) అనే యువకుడు కొంతకాలంగా చెన్నైలో ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ గత పది రోజుల కిందట తన సొంత గ్రామమైన తడిగిరికి గ్రామానికి వచ్చాడు. అయితే తనకు పెళ్లి వయసు వచ్చిందని వెంటనే పెళ్లి సంబంధం చూసి పెళ్లి చేయమని తండ్రిని కోరాడు. దానికి తండ్రి అయిన లక్ష్మయ్య నీవు తరచుగా మద్యం తాగుతూ గుట్కాలకు బానిస అయ్యావని నీకు పిల్లని ఎవరు ఇవ్వడానికి ముందుకు రావడం లేదని చెప్పడంతో పెళ్లి జరగదనే బాధతో మద్యం మత్తులో తన ఇంటికి సుమారు 100 మీటర్ల దూరంలో గురువారం చెట్టుకి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు సచివాలయం మహిళ పోలీస్‌కి సమాచారం అందించగా మహిళా పోలీస్ స్థానిక ఎస్ఐ సతీష్‌కు ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి

విశాలాంధ్ర - కొయ్యూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబాలకు దాతలు సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని ఎస్ఎస్ఎఫ్ మండల ధర్మ ప్రచారక్ సన్యాసిరావు కోరారు. మండలంలోని అంతాడ పంచాయతీ తాటిమానుపాలెం గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నాలుగు తాటాకిళ్లు దగ్ధం కాగా ఏడు కుటుంబాల గిరిజనులు నిరాశ్రయులయ్యారు. బాధిత కుటుంబాలను పరామ ర్శించిన ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధులు వారికి ధైర్యాన్ని చెప్పారు. చిన్నపిల్లలతో నిలువ నీడను కోల్పోయిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని సన్యాసిరావు, శ్రీను లు కోరారు.

ఓపెన్ ఇంటర్‌కు అవకాశం

విశాలాంధ్ర - కూనవరం: పదవతరగతి తర్వాత చదువు మధ్యలో మానేసిన వారికోసం ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి సార్వత్రిక విద్యా విధానం ద్వారా మరో అవకాశాన్ని కల్పించిందని కూనవరం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి చంద్రశేఖరరావు తెలిపారు. ఈ విధానం ద్వారా అభ్యర్థులు పదవతరగతి మార్కుల లిస్టు ఆధార్ కార్డు పాస్ ఫోటో రిజిస్ట్రేషన్ నిమిత్తం మొబైల్ నెంబర్ తదితరాలను ఈనెల 27 లోగా అందజేయవలసిందిగా కోరారు. అడ్మిషన్ పొందిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఏప్రిల్ లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పట్టణంలో పట్టపగలే దొంగల హల్‌చల్

ద్విచక్ర వాహనంలో పెట్టిన నగదు చోరీ

విశాలాంధ్ర -యలమంచిలి: పట్టణంలో గురువారం పట్టపగలే దోపిడీ దొంగలు హల్ చల్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యలమంచిలి మెయిన్ రోడ్ ప్రక్కన గల ఎస్బిఐ వద్ద గురువారం ఉదయం పట్టణంలో నెహ్రూ నగర్ కి చెందిన వ్యక్తి ఎస్బిఐ లో తాను దాచుకున్న సొమ్మును వ్యక్తిగత అవసరాల నిమిత్తం విత్ డ్రా చేసుకుని బ్యాంకు బయట పార్క్ చేసిన తన స్కూటీ డిక్కీలో పెట్టుకుని కొన్ని చిరిగిపోయిన డబ్బు నోట్లను బ్యాంకులో మార్చుకుందామని వెళ్లి తిరిగి బయటకు తన స్కూటీ వద్దకి వచ్చేసరికి డిక్కీ తెరిచి ఉండటం చూసి డబ్బులు కనబడకపోవడంతో పట్టణ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడిషినల్ ఎస్సై కె.వెంకట్రావ్ తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులకు బంగారు పతకాలు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయ చిత్రలేఖనం పోటీలో రాజవొమ్మంగి జిల్లాపరిషత్ హైస్కూల్‌కి చెందిన ఆరుగురు విద్యార్థినిలు హారిక, హానిప్రియ, కామేశ్వరి, శ్రీదుర్గ, కామేశ్వరి, అపర్ణ విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల ప్రదానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్ బంగారు పతకాలను, బాలచిత్ర కళాశ్రీ అవార్డులను ప్రదానం చేసి అభినం దించారు. చిత్ర లేఖనం ఉపాధ్యాయుడు మిరియాల కొండబాబుకు ఆర్ట్స్ గురు అవార్డ్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్ అసోసియేషన్ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖ పట్నం: నగరంలో హోటల్ అసోసియేషన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని నగర మేయర్‌కు నూతన కమిటీ వినపత్రాన్ని అందజేసింది. గురువారం గ్రేటర్ విశాఖపట్నం మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని విశాఖపట్నం హోటల్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వసంత కృష్ణా, జనరల్ సెక్రటరీ కామినేని సాంబ శివరావు, కోశాధికారి యస్.సంజీవ రెడ్డి, హోటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తాళ్లూరి సత్యనారాయణ, ఆకెళ్ళ రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ శివ రెడ్డిలు వినతి అందించారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని మేయర్ హామీ ఇచ్చారు.

రాష్ట్ర సాంస్కృతిక సమితి క్రియేటివ్ హెడ్‌గా జోగినాయుడు

విశాలాంధ్ర - నాతవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృ తిక సమితి క్రియేటివ్ హెడ్‌గా సినీనటుడు వ్యాఖ్యాత ఎల్.జోగినా యుడు బాధ్యతలు స్వీకరించారు. వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాల యం నాల్గో బ్లాక్‌లోని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా.రజత్‌భార్గవ చాంబరులో ఆయన బాధ్యతలను చేపట్టారు. రాష్ట్రంలో సాంస్కృతిక పురోగతి, తెలుగు భాషాభివృద్ధి, పద్య, ఆధునిక నాటక వికాసం, జానపద కళారూపాల అభివృద్ధి ఆధునీకరణ తదతర కార్యక్రమాలను చేపట్టేందుకు ఈయనను నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షుడుగా దగ్గుపల్లి

విశాలాంధ్ర - పాయకరావుపేట: వైసీపీ పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షుడుగా పాయకరావుపేటకు చెందిన వైసీపీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబాను నియమించారు. ఈమేరకు వైసీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి విడుదల చేసిన జాబితాలో దగ్గుపల్లి సాయిబాబా పేరు చోటు చేసుకుంది. తనకు పదవి కల్పించినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డికి, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీకి, జిఆల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావుకి దగ్గుపల్లి సాయిబాబా కృతజ్ఞతలు తెలిపారు.

లైఫ్‌స్టైల్ తాజా సమ్మర్ కలెక్షన్ విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ: లైఫ్‌స్టైల్, లేటెస్ట్ ట్రెండ్‌ల కోసం భారతదేశంలోని ప్రముఖ ఫ్యాషన్ హౌస్, స్టైలిష్ కొత్త కలెక్షన్‌ను లాంచ్ చేసింది. ఇది మీ సమ్మర్ వార్డ్‌రోబ్‌కి సరైన ఎంపికగా మారుతుంది. పూల ప్రింట్లు, ప్రకాశవంతమైన రంగులు లేదా పాస్టెల్ టోన్‌లను ధరించడానికి వేసవి వసంతకాలం అనువైన కాలం. అక్కడ ఉన్న అధునాతన మహిళలందరికీ, అల్లం మృదువైన ప్యాలెట్‌లలో పాప్ రంగు యొక్క సూచనతో చిక్ సిల్హౌట్‌లను కలిగి ఉంది. బూట్‌కట్ కో-ఆర్డ్ సెట్‌లు స్నేహితులతో బ్రంచ్ ఔటింగ్ కోసం సరైన ఎంపికను చేస్తాయని ఆ సంస్థ ప్రతినిధులు చెప్పారు.

మార్చి 2 నుంచి ఫర్నిచర్ ఎక్స్ పో

విశాలాంధ్ర - విశాఖ సిటీ: గ్రేటర్ నోయిడా ఢిల్లీలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్‌లో మార్చి 2 నుండి 5 వరకు ఢిల్లీ వుడ్ ప్రదర్శన షో జరగనుంది. రాబోయే ఢిల్లీ వుడ్ 7వ ఎడిషన్‌లో, చెక్క పని ఫర్నిచర్ తయారీ పరిశ్రమకు చెందిన వాటాదారులు అనేక జాతీయ, అంతర్జాతీయ నిర్ణయాధికారులు పాల్గొననున్నారు. ప్రదర్శనలో లేటెస్ట్ ఫర్నీచర్ ప్రొడక్షన్ టెక్నాలజీస్, వుడ్ వర్కింగ్ మెషినరీ, టూల్స్, ఫిట్టింగ్స్, యాక్సెసరీస్, రా మెటీరియల్స్, ప్రొడక్ట్స్ మొదలైనవి ఉంటాయి. ఇండియా మ్యాట్రెస్‌టెక్ ప్లస్ అప్‌హోల్‌స్టెరీ సప్లైస్ ఎక్స్‌పో, మెట్రెస్ ప్రొడక్షన్ మెషినరీ సామాగ్రి, మ్యాట్రెస్ ఫినిషింగ్ మెషినరీ సామాగ్రి, ప్రొడక్షన్ టూల్స్ ఎక్విప్‌మెంట్, అప్‌హోల్‌స్టరీ ప్రొడక్షన్ టెక్నాలజీ, మెషినరీ సామాగ్రి, బెడ్ సిస్టమ్స్, కొత్త మెటీరియల్స్, ట్రేడ్ అసోసియేషన్‌లు ప్రదర్శించబడతాయి.

కొనసాగుతున్న రూ.5కే భోజనం

విశాలాంధ్ర -యలమంచిలి: యలమంచిలి టీడీపీ కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ ద్వారా అందిస్తున్న రూ.5లకే భోజనం గురువారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. టిడిపి ఎన్నారై మహిళా విభాగం ఆర్థిక సహాయంతో యలమంచిలి నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ పార్లమెంటు సభ్యులు,సీనియర్ టీడీపీ నాయకులు పప్పల చలపతిరావుల సూచనలతో నిర్వహిస్తున్న ఈ పథకంలో భాగంగా రూ.5లకే తిన్నంత భోజనం అందిస్తున్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు గొర్లె నానాజీ, క్లస్టర్ ఇంచార్జ్ బోద్దపు శ్రీనివాసరావు, ఐటీడీపీ పెయ్యల రామకృష్ణ, దేశంశెట్టి ఎల్లయ్యనాయుడు, గొర్లె బాబురావు, కోన హరికృష్ణ, కరణం ప్రకాష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - పద్మనాభం: రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త నిర్వహణలో కురపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన కోసూరి సన్యాసిరాజు కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ సన్యాసిరాజు నిగర్వి, నిడారంబరుడు అయిన సామాన్య కుటుంబీకుడని, వారి పిల్లల చదువులకు తమ ట్రస్టు అండగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఏపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, మండల ప్రధాన కార్యదర్శి పాలూరి కృష్ణారావు, యువ మోర్చా ప్రతినిధి గేదెల శ్రీహరి, మహిళా నేత పి.మల్లీశ్వరి, పాకలపాటీ లక్ష్మి, హేమ, సావిత్రి పాల్గొన్నారు.

పది కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - మాకవరపాలెం: అక్రమంగా తరలిస్తున్న 10 కేజీల గంజాయిని పట్టుకున్నామని మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు తెలిపారు. గురువారం కొండలఅగ్రహారం జంక్షన్ వద్ద ఏపి 31 సిఎల్ 8543 నెంబరు గల ద్విచక్ర వాహనంపై కోటవురట్ల మండలం గొట్టివాడ గ్రామానికి చెందిన బండి పరమేశ్వరరావు, కలిగట్ల లక్ష్మీ దుర్గాప్రసాద్ అనే ఇద్దరు వ్యక్తులు 10 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకొని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: "ది సొసైటీ ఫర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్" ఆధ్వర్యంలో విశాఖలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఏర్పాటు చేసి 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, రాజేష్ కుమార్ తెలిపారు. గురు వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్థిక సామాజిక వెనుకబడిన వర్గాల విద్యార్థులను సహాయము చేయడానికి స్థాపించబడిన లాభాపేక్ష లేని సంస్థ డా. లంకపల్లి బుల్లయ్య కళాశాల అన్నారు. గత 50 సంవత్సరాల చరిత్రలో, దేశంలోని అనేక సంస్థలలో తమ పూర్వ విద్యార్థులు చాలా మంది ప్రతిష్టాత్మకమైన స్థానాలను చేరుకున్నారన్నారు. పూర్వవిద్యార్థులు ఎ.పి. హైకోర్టు సిట్టింగ్ జడ్జిలు డి. వి. సోమ యాజులు, చీమలపాటి రవి, క్రికెటర్ ఇండియన్ టీమ్ కె ఎస్ భరత్, డబ్ల్యుఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ గ్రూప్ సిఇఒ కేశవ్ ఆర్ మురుగేష్, సినీ నటి శ్రీమతి గౌతమి, మొదలైన వారు బుల్లయ్య కళాశాల పూర్వవిద్యార్థులని చెప్పారు. డా. లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఇటీవల ముంబైలోని వరల్డ్ హెచ్‌ఆర్‌డి కాంగ్రెస్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డు 2023ని అందుకుందన్నారు.

వైసీపీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకంపై హర్షం

విశాలాంధ్ర - హుకుంపేట: వైసీపీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు నియమించడంపై స్థానిక వైసీపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వాణిజ్య విభాగం అధ్యక్షులు ఒంటుబు సామ్యూల్, కల్చరల్ వింగ్ జిల్లా అధ్యక్షులు జీ.ధి లిఫ్ కుమార్‌లు నియమితులు కావడంతో స్థానిక వైసీపీ శ్రేణులు వీరిని అభినందించారు. మండల పార్టీ అధ్యక్షులు గెమ్మెలి కొండబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, సొసైటీ బ్యాంకు చైర్మెన్ కే.రామకృష్ణా, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ ఎస్.కొండలరావు, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, సర్పంచ్లు బేసు, చిన్నారావు, వెంకట్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కొర్ర నాగరాజు, కామరాజు, నాయకులు భూషణ్, సుబ్బు, చిన్నయ్య. జన్నీ సింహాచలం పాల్గొన్నారు.

పౌరుల చైతన్యమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష

విశాలాంధ్ర - మల్కాపురం: ప్రజలు చైతన్య వంతులైనప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని సెయింట్ ఆన్స్ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన "భారత రాజకీయాలు- పౌర చైతన్యం" అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇటీవలి కాలంలో ప్రజలు విద్యావంతులు, చైతన్యవంతులు అయ్యారని, ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ద్వారా, సమాచార హక్కు చట్టం ద్వారా, న్యాయ సమీక్ష ద్వారా, మీడియా ద్వారా ప్రభుత్వాన్ని అదుపులో పెడుతున్నారని ఇది శుభ సూచకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగ సీనియర్ అధ్యాపకురాలు వై.అనసూయా దేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్, విద్యార్థి నాయకులు అవంతి, ధనుషా, ధనలక్ష్మి, సాక్షి, శ్రేయ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై వేడి నూనె పోసి దాడి చేసిన భార్య

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండలం లక్ష్మీపురం పాలు సంఘం మాజీ అధ్యక్షుడు సిరిసోళ్ళ ఈశ్వరరావు పై అతని భార్య విజయ మరగబెట్టిన వేడి నూనె పోసి దాడి చేసింది. దీని పై భాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం ఈశ్వరరావు గతంలో రెండు సార్లు పాల సొసైటీ అధ్యక్షుడుగా చేశాడు, ప్రస్తుతం జీవనోపాధి కోసం ఆటో నడుపుకుంటున్నాడు. మొదటి భార్య చనిపోవడంతో అదే గ్రామానికి చెందిన విజయను సుమారు 16 సంవత్సరాల క్రితం రెండవ పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యకి ఇద్దరు ఆడపిల్లలు ఒక కుమారుడు, రెండవ భార్యకి ఒక కుమారుడు ఉన్నారన్నారు. మొదటి భార్య పిల్లలు అందరకు పెళ్ళిళ్ళు అయిపోగా, ఆస్తి పంపకం విషయంలో తలెత్తిన సమస్యలతో ర భార్యా భర్తలు చిన్న తగాదాలు పడేవారు. దాంతో భార్యా భర్తలు ఎడమొఖం పెడముఖంగా ఉనదేవారు. దీనిపై రెండవ భార్య అనకాపల్లి దిశా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ కేసు నడుస్తుండగా గ్రామ పెద్దలు ఇరువురికి నచ్చజెప్పి చేసి కలిసి ఉండమని చెప్పే వారు. ఇది ఇలా వుండగా బుదవారం రాత్రి 9 గంటల సమయంలో ఈశ్వరావు మీద, రెండవ భార్య మరగ బెట్టిన నూనె పోసిందని స్థానికులు చెబుతున్నారు. విషయాన్ని గమనించిన గ్రామస్థులు హుటాహుటిన చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సహాయం చేశారు. దీని పై బాధితుడు ఈశ్వరరావు, కుమారుడు చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దేశాలు దాటుతున్న జమాల్ ఖాన్ ఆయుర్వేద చికిత్సలు

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతూరు రెవెన్యూ డివిజన్లోని నిమ్మలగూడెం, ఎటపాక, ఒరిస్సాలోని ఇస్మాయిల్ నగర్ తూర్పుగోదావరి జిల్లాలో ఆయుర్వేద చికిత్స క్యాంపులను ఆయుర్వేద ప్రముఖ వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ నిర్వహిస్తూ వేలాదిమంది మంది రోగాలను తన చికిత్స ద్వారా నయం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అమెరికా వాసులు జమాల్ ఖాన్ కలవడానికి వచ్చారు. అల్లోపతి వైద్యానికి లొంగని రోగాలు ఆయుర్వేద చికిత్స ద్వారా పూర్తిగా నయమవుతున్నాయి. షుగర్ బిపి అల్సర్ సయాటికా ప్రారంభ దశలో ఉన్న పక్షవాతం మరియు క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులకు కూడా ఆయుర్వేద మందులు అమో ఘంగా పనిచేస్తున్నాయి అంటే అతిశయోక్తి కాదు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు పెట్టిన తగ్గని ముందు రోగాలు ఆయుర్వేద చికి త్సతో తోక ముడుస్తున్నాయి. అమెరికాలో ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్న కుటుం బానికి యూట్యూబ్ సోషల్ మీడియా మధ్యమాల ద్వారా జమాల్ ఖాన్ ఆయుర్వేద చికిత్స చూసి ఇండియాకు తిరిగివచ్చి ఎటపాక క్యాంపులో జమాల్ ఖాన్ను కలిసి చికిత్స మందులను తీసుకొంటున్నారు.

బొలేరో వాహనం చోరీ కేసు చేధించిన పోలీసులు

విశాలాంధ్ర - జికెవీధి: జీకేవీధి మండల కేంద్రంలో బొలేరో వాహనం చోరీ కేసును జికెవీధి పోలీసులు చేధించారు. ఈ నెల 16 అర్ధరాత్రి జికెవీధికి చెందిన సయ్యద్ అల్తాహిర్‌కు చెందిన ఏపి 31 టిసి 2121 నెంబరు గల బొలేరో వాహనం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు దొంగలించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు చింతపల్లి ఏఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆధ్వర్యంలో జికెవీధి సిఐ అశోక్‌కుమార్, జికెవీధి ఎస్సై అప్పలసూరి, సీలేరు ఎస్సై రామకృష్ణ ఈ కేసును సవాల్‌గా తీసుకొని ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వారు దొంగలించినట్లుగా గుర్తించారు. గురువారం పాతవీధి జంక్షన్‌లో జికెవీధి ఎస్సై అప్పలసూరి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ గ్రామానికి చెందిన కిలో సురేష్(33), తామర బిల్లా నవీన్(19)లను పట్టుకొని విచారించగా బొలేరో వాహనం చోరీ నిందితులను నిర్ధారించి అరెస్టు చేశారు. పోలీసులను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్‌లు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటమే శరణ్యం: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర - చింతపల్లి: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన దశల వారి పోరాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బౌడు గంగరాజు అన్నారు. సిపిఎస్ రద్దు చేసి, ఓ పి ఎస్ విధానాన్ని అమలు చేయడంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలి అంటూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఒకరోజు ధర్నాలో ఆయన మాట్లాడారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని, ఉపాధ్యాయులకు బోధ నేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న 3 డిఎ లను వెంటనే మంజూరు చేయాలని సుమారు 17 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అల్లూరి జిల్లా కార్యదర్శి కిల్లంగి పెద్దబ్బాయి, జిల్లా ఉపాధ్యక్షులు దేపూరు శశి కుమార్, మండల అధ్యక్షులు తగ్గి అప్పన్న దొర, మండల ప్రధాన కార్యదర్శి పాంగి బాబురావు, మండల గౌరవ అధ్యక్షులు లోచెల చిట్టి నాయుడు, కార్యవర్గ సభ్యులు కిల్లంగి ప్రసాద్, గేమ్మెలి కామేశ్వరరావు, గణపతి, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.